# అనంతకోటినక్షత్రాలు

అంకితము.

[ప్రేమపూర్వకంగా:—శ్రీ పాటిమళ్ళ కృష్ణదాసుగారికి.]

రచయిత:

## మోతుకూరు వేంకటేశ్వర్లు

'—మగపిల్లవాడు, యేడవడం లేదు' అన్న టెలిగ్రాం చూసుకొని- అప్రయత్నంగా జేబులోని 'రెండణాలు' తీసి యిచ్చా- బంట్రోతుకి!

యేమనుకున్నాడో యేమో! యెగాదిగా చూచి- వెళ్ళిపోయాడు.

స్నేహితులందరూ చుట్టుముట్టారు.

—చేతిలోవున్న 'పదివేల రూపాయల' కథల ప్రూఫులు క్రిందపడేసి నేనూ కూచున్నా!

'యెక్కడినుంచి?' నారాయణ ప్రశ్న.

'ప్రమాదము యేమీ లేదుగా!'—అని రామారావు పరామర్శ.

లేదని నవ్వుతూ- తలూపాను.

'మరి- టెలిగ్రాం యేంటీ-?' అని లక్ష్మణరావు.

యేమీ లేదులే!- అని నవ్వాను.

'ఓహో- మనకు బాల్ యెప్పుడు చేస్తావేం?-' సాంబశివరావు గ్రహించినట్లు మాట్లాడాడు.

'ఆ- ఆ- అదేనా?- కొడుకా, కూతురా!' అందరూ ఒకేసారి అడిగారు.

నవ్వుతూ చూపించాను.

'—తప్పదు మరి బాల్ చేయాలి.' సాంబశివరావు తిరిగి అడిగాడు.

చూసివచ్చిన తరువాత చేస్తానులే, అని నమ్మించి రూములోనుండి యింటికి వచ్చాను.

వంట్లో నీరసంగావుంది, ఆఫీసుకు శెలవుపెట్టి పండుకున్నా!

—టెలిగ్రాం వచ్చిందని తెలుసుకొని, యింటిల్లిపాదీ ఆనందించారు. సంతోషించారు.

'అయిదో నెలనుండి జబ్బే వదినకు- మందులవేడికి, కాగికాగి- పుట్టుంటాడు పిల్లాడు- మొండి ఆయుస్సు' అంది. చెల్లెలు రమణ సంతోషంగా!

'యిచ్చినవాడు మరచిపోతే, అదే చాలు-' నాయనమ్మ అంది ఆనందంగా!-

"చిట్టిమాటకు రగిలి
చెలగు సంతోషంబు
మురిపెంపు నాయెదకు
తగని సౌఖ్యజ్వాల'

మొగలిపూలలోని వేయిరేకుల మత్తు వాసనలా?- సుగంధ నిర్మలధూమరేఖకు ఆనందించిన మనస్సులా?- యెందుకో హృదయం విప్పారింది.

'యిరవై యేళ్ళన్నా లేవు- అప్పుడే తండ్రయ్యాడు' అంటూ- శీతల మృణాలవంటి చేతులతో నవ్వుతూ తలనిమిరింది- మా అమ్మ!

ప్రసవించింతరువాత చేయిద్దామనుకున్న చిన్నగడ్డాన్ని చేత్తో రాసుకుంటూ,- యిరువైనాలుగోయేడయినా?- యిరవై సంవత్సరాలే తనకొడుక్కు- అంటున్న తల్లిప్రేమకు విస్తుపోతూ- చిన్నగా పెదిమలపైన నవ్వాను.

'టెలిగ్రాంయిచ్చారు వెళ్ళన్నా!' అంది చెల్లెలు.

'చూసిరారా!' అంది నాయనమ్మ.

—యింట్లో అందరి తాఖీదీ యెక్కువయింది.

వసారాలో, ఓమూల- పైనుంచి పడిపోయి, ప్రాణంవిడచిన పిచ్చుక పిల్లను చీమలు పట్టుకుంటే- దూరంగా, గోడపైవున్న తల్లి అయోమయంగా అరుస్తుంటే- చూస్తూ సరేనన్నా!

నీరసంగా వున్నందువల్ల వెళ్ళలేక ప్రొద్దున్నే వెళ్దామనుకొని- సారస్వత సమితి తరఫున 'పదివేలరూపాయలు' కథానికల సంపుటి ప్రింటు అవుతుంటే- ప్రూఫులు దిద్ది, సమితి ఆశయంవ్రాసి- కంపోజ్ చేయించి- సాయంకాలం పార్కులోకి బయలుదేరా!

'కాంచలేను, కాంచలేను.' అనే గీతాన్ని రేడియోనుండి రసవత్తరంగా లక్ష్మీరాజ్యం పాడుతుంటే—నా అంతస్సుందర చైతన్యం మేల్కొని, మలయమారుత భృంగాల్లో మిళితమైపోయింది.

* * *

మామూలు దుస్తులతో వుదయంబండికి- స్టేషనుకుచేరుకొని, పెట్టెలో కూచున్నా!—

నురుగలు క్రక్కుతూ బండి పరుగెత్తుతుంటే, అయోమయంగా పండుకున్నా!

—విభ్రాంతుల్నిచేసి, పాఠకుల కొకనీతిని చూపించి- హృదయాన్ని కలచి

[మిగతా ౧౦౧-వ పేజీలో.

# సంగమ్మ

'ఎఱుక చాలనివాఁ డందమే దధీచి,
నల్పబుద్ధులె మేఘవాహనుఁడు, శిబియు
ధరఁ 'బరోపకారార్థ మిదం శరీర'
మనెడు వాక్యంబు వినవె? సంయమివరేణ్య!
అధ్రువంబైన మలభాండమైన దేహ
మనఘ! యన్యోపకారార్థమై వ్యయించి
ప్రవిమలంబుఁ గల్పాంతరధ్రువముసైన
కీర్తి కాయంబుఁ గైకొంట కార్తి యేల?'

—హరవిలాసము.

చిఱుతొండనంబి చిరంటి తిరువెంగనాంచి కడుపునఁబుట్టిన కూరిమి కొడుకును, సుకుమారమూర్తిని, కులవర్ధనుని, సిరియాళుని చిత్రవధచేసి శివయోగికి ఓగిరముగా వండిపెట్టిన పురాణకథ ప్రఖ్యాతమై ఉన్నది.

ఆపురాణకథతోఁ బురుడించు ఆంధ్రచారిత్రకగాథ యొకటి ఇచట ప్రస్తరింపఁబడుచున్నది.

ఈ కథానాయక నామము సంగమ్మ.

చిఱుతొండని చిరంటివలె సంగమ్మయు నసామాన్యమైన పుత్రస్నేహమును దిగఁద్రావినది; చెక్కు గీటిన వసవల్బుం చిఱుతవాని చిత్రమరణమును ధైర్యచిత్తముతో నోర్చినది.

పరార్థమై తనూధనమును, సంతానధనమును వ్యయింపఁగలుగుటయే జనన్నైకఫలమును స్తవనీయ విశ్వాసముతో నపూర్వమైన ప్రాణత్యాగ మొనర్చి ఆంధ్రమహిళ సంగమ్మ లోకారాధనీయమైనది.

కావున ఆపూజ్యురాలి పుణ్యచరిత్రమును విని పునీతులుగండు.

విద్యానగరరత్నసింహాసనాధీశ్వరుఁడైన ప్రౌఢదేవరాయల సరదారులలో గోన కాటారెడ్డి ఎన్నికగన్నవాఁడు. కులమునకు ఆతఁడు తెలగ. అతనిది మిడిమెల్ల గోత్రము. కాటారెడ్డిచేసిన సేవకు మెచ్చి రాయలవారు మగదత్తి, రాయచూరు అను గ్రామములందు కోటలు నిర్మించుటకు ఆతనికి ఆజ్ఞనిచ్చిరి.

రాజాజ్ఞ తలనిడుకొని కాటారెడ్డి మొదట మగదత్తిలో కోట కట్టుటకుఁ బ్రారంభము చేసెను. పని చుఱుకుగా జరిగెను. బురుజులు తీరి కోట అచిర కాలముననే పూర్తియయ్యెను. అనంతరము కాటారెడ్డి రాయచూరుగ్రామమున కోట కట్టుటకు మొదలిడెను.

శుభముహూర్తమున దుర్గనిర్మాణమునకు శంకుస్థాపనజరిగెను. పునాదులు ఏర్పడినవి. గోడలు లేచినవి. కాని బురుజుపని తుదముట్టలేదు. పూర్తి కాకుండగనే అది నేలకూలెను. అంతమాత్రమున కాటారెడ్డి నిరుత్సాహపడలేదు. తిరిగి పనిప్రారంభముచేసెను. కాని ఈ మాఱుకూడ బురుజు నిలబడలేదు. రెడ్డికి అనుమానముతోచెను. అయినను మఱల నాతఁడు బురుజుపని రెట్టింపు కట్టుదిట్టములతోఁ జేయించెను. కాని కార్యము లేక పోయినది.

తిరిగి బురుజు నేలమట్టమయ్యెను. ఇట్లు నాలుగైదుసారులు జరిగెను. అందుతో కాటారెడ్డికి అనంతమగు విచారముకలిగెను. తుది ప్రయత్నముగా ఆతఁడు మఱల బురుజు నిర్మించుటకు దొరకొనెను. అప్పుడచ్చట పని చేయువారిలో నొక కాఁపువానికి శివమెత్తెను. ఆ వేశము కనుపించిన పురుషుఁడు కాటారెడ్డితో నిట్లు పలికెను,

"నే నొక మహాశక్తిని. చిరకాలముగా నీ ప్రదేశమును ఆశ్రయిం

చుకొనియున్నాను. బలి యిచ్చి నన్ను తృప్తిపఱచిగాని మీరిచ్చట కోట గట్టలేరు. మీరు నాకు బలి ఈయనికారణమున బురుజును కూలఁద్రోయుచున్నాను. నాకు సాధారణమైన బలితో సంతృప్తికల్గదు. ఒక బాలెంతను ఆమె కనిన బిడ్డతోఁగూడ నాకు బలినీయవలెను. ఇచ్చెదరా బురుజు నిలుచును. ఈయరా మీ రీజన్మమున నిచ్చట కోట నిర్మింపఁజాలరు."

కాటారెడ్డి యిది వినెను. దీర్ఘ విచారపరీతమైన అతని మనసు ఆలోచనాధీనమయ్యెను. కోట నిలబడుటకని ఏ స్త్రీ వచ్చి శిశుసహితముగ బలిపోవును? ప్రాణములపై తీపిని చంపుకొనుటకు కొందఱు సాహసింప వచ్చును. కాని కడుపార గన్న బిడ్డను మృత్యుముఖమున చేతులార నర్పించుటకు ఏ తల్లిప్రాణ మంగీకరించును? ఇంత ప్రయత్నము చేసి దుర్గనిర్మాణమును పూర్తి చేయక పోయి అతఁడే మొగముతోఁ దిరిగి తన యేలికయగు ప్రౌఢదేవరాయలను దర్శింపఁగలఁడు? ఎన్నివిధముల చింతించినను అతనికి ఆలోచన తెగలేదు.

కోటలోనున్న మహాశక్తి శిశుసహితముగ నొక బాలెంతరాలిని బలిగోరుచున్న వార్త జలత్తైలబిందువై రాయచూరు గ్రామమున మారుమూలలయందుఁ గూడ వ్యాపించెను. తుద కాసంగతి పురుటిమంచముపైనున్న తెలగవారిచిన్నది సంగమ్మ చెవికిఁగూడఁ జేరెను. ఆమె అప్పటికి మూఁడు దినములకుఁ బూర్వము ప్రసవించియున్నది. కోట కట్టుటకు కాటారెడ్డి చేయుచున్న సకలప్రయత్నములును బూడిదలోఁ బోసిన పన్నీరగుచుండుట ఆమె గమనించెను. కోటతీరినచో నది ప్రజలకు మిక్కిలి ఉపకారిగా నుండగలదని ఆమె నిజ మూరసెను.

"చావు ఎప్పటికైన తప్పనిదే. జరాభారమున క్రుంగి, రోగములచే క్రమంది జీవితమును నిరర్థకముగా తుద ముట్టించుటకంటె ప్రజాభ్యుదయమునకై ఇప్పట్టున మరణమును వరించుట ఉత్తమము; కీర్తిదాయకము" అని త్యాగమహితము, పరార్థప్రవణము అగు బుద్ధిగల సంగమ్మకుఁ దోచెను. తన డొక్కలోదూరి పరుండియుండి అప్పుడప్పుడే నేత్రములను విప్పి లోకమును గాంచుచున్న ఆ నెత్తురుకందు నొక్కసారి యామె తిలకించెను. "ఈప్రజోపయోగకార్యములో నా చిట్టిబిడ్డకూడఁ బాల్గొనుగాక! పసరుమొగ్గకు దేవతాపీఠమున స్థానము లభించునుగాక!" అని ఆమె నిష్కర్ష చేసికొనెను.

పొత్తులలో పాపనిడుకొని ఆ పచ్చిబాలెంతరాలు కోటచెంతకుఁ బోయెను. నిజపుత్రసహితముగ నామె నిస్త్రింశభావముతో, నిరాకులాత్మతో, నిశ్చలబుద్ధితో, నిర్వికారాకారముతోఁ బునాది గోతిలో దుమికెను.

అప్పట్టున నామె సంసారభ్రమ మించుకేనియుఁ బొందలేదు; వైక్లబ్యము వీసమంతయున నొందలేదు. పుత్రునిపట్లగల ప్రేమస్నేహవాత్సల్యసంపద నంతను దిగఁద్రావినది.

ఆసన్నమైన సప్రాణసమాధిసంగతి నెఱుఁగక తన పొత్తిళ్ళలో నుండి పాలబుగ్గలను లేఁతనవ్వుతో రాణింపఁజేయుచున్న చిఱుతవాని చిన్నారివదనమును జూచిన పిమ్మటనైన ఆమె కన్నులు చెమ్మగిల్లలేదు; చెక్కుటద్దములు వికాసము దప్పలేదు.

కండక, గాజువాఱక ఆమెకళ్లు, చెక్కిళ్లు యథాపూర్వముగ మధురమందహాసనిష్యందముతో నొప్పారుచుండెను.

అప్పుడు కూలివాండ్రు చుఱుకుగా ఆపునాదిలో ఆమాతాశిశువుల పైన ఇటికలుపేర్చి గోడలు కట్టిరి. గోడలు లేచెను. బురుజు తీరి చెక్కు చెదరక నిలచెను. క్రమముగా మిగిలిన బురుజుల నిర్మాణము కూడఁ బూర్తియయ్యెను; దుర్గము సర్వాంగపరిపూర్ణశోభతో విలసిల్లెను.

సంగమ్మ చేసిన అపూర్వత్యాగము దేనికి రూపసిద్ధి కల్పించినదో ఆ రాయచూరుదుర్గమునుండి ప్రభుత్వము సాగించి కాటారెడ్డి కాటభూనరేంద్రుఁడని ప్రసిద్ధి చెందెను.

తనఅభ్యుదయమునకు సంగమ్మ త్యాగము మూలదుంప యన్న సంగతి రెడ్డి ప్రాణము లున్నంతవఱకు విస్మరింపలేదు.

మహాత్యాగిని సంగమ్మ శిశుసహితముగా బలివోయినిలిపిన బురుజు యిప్పటికిని ఆమెపేరిట 'బాలెంత సంగమ్మకోట' అని వ్యవహరింపఁ బడుచున్నది. త్యాగధనుల పవిత్రనామములు అక్షరమను సూత్రము నీ విషయము ప్రతిపాదించుచున్నది.

సంగమ్మ త్యాగము అతిలోకమైనది. పరోపకారార్థము ప్రాణత్యాగ మొనర్చిన రమణీమణులు ఇతిహాసప్రపంచమునఁ బలువురు గలరు. కాని శిశుసహితముగ బలివోయినవారు మిక్కిలి తక్కువ. తల్లికిఁ దన ప్రాణముమీఁద కంటె తన బిడ్డ ప్రాణముమీఁద మమకారము హెచ్చు. అట్లుండుట ప్రకృతిసిద్ధము. లోకసహజమైన అట్టి మమకారమును గూడ తెగఁగోసి లోకోపకారార్థము శిశుసహితముగ ప్రాణములను విడిచిన తెనుఁగుపడఁతి సంగమ్మ త్యాగబుద్ధి కొలఁదులువెట్టఁదరము కానిది. ఆమె సాహసము శతధా శ్లాఘింపవలసినది.

—'ఆంధ్రరమణీమణుల' నుండి.

# ప్రణయతత్త్వము

అఖిలజగములు ప్రణయమయంబు సకల
జంతుజాలంబు ప్రేమపాశంబుచేతఁ
గట్టబడియుండె; నీధరగల్గు జనులు
ప్రేమతత్త్వంబు తెలియని వెఱ్ఱివారు!
కంటికిని ఱెప్పవోలె లోకముల నెల్లఁ
గాచి రక్షించునట్టి లోకైకనాథు
భక్తి సేవించుటే యగుఁ బ్రణయమనగ!
తనదు జన్మకారణులగు తల్లిదండ్రు
లందు మనుజుల కుండెడి యప్రతిహత
మగు కృతజ్ఞతయే ప్రేమ యవనియందు!
సతికి పతియెడ సతిపైనఁ బతికిగల్గు
గాఢ యనురాగమే ప్రేమగా దెలియుడీ!
ఛాత్రతతియెడ గురుని వాత్సల్యతయును
గురువునెడ పూజ్యతయు శిష్యవరులు భక్తి
మెలఁగుటయు ప్రేమయేయంచు దెలియవలయు!
సర్వలోకాల సృష్టి విశాలదృష్టి
గాంచి దయఁబూను యోగిపుంగవునికిఁగల
సర్వమానవసోదర సమతప్రేమ!
ఒప్పుగా ప్రాణమిత్రుల కొకరిపైన
నొకరికుండెడి దృఢమైత్రియే ప్రణయము!
మనల గన్నట్టి శ్రీయాంధ్రమాత యెడల
గౌరవము, దేశసేవ, త్యాగములు ప్రేమ!
ప్రభువునెడఁ బాలితులకును ప్రజల యెడల
ప్రభువునకునుండునట్టి పరస్పరాను
రాగవిశ్వాసభక్తులే ప్రణయమగును!
జగతిలో నరులు పెంచెడి జంతుతతికి
వాని యజమానులయెడ నవ్యాజప్రేమ
భక్తివిశ్వాసములు జూడఁ బ్రణయజములు?
రవియు జంద్రుఁడు రిక్కలు రాత్రిఁబగలు
జేయు నీవిధ మెల్ల యోచించి జూడ
ప్రణయ ప్రతిబింబ మని జనుల్ పలుకునట్టి
వారిజాక్షుఁడు చూపు యవ్యాజకరుణ!
ఫలరహితమైన రాగమే ప్రణయమగును!
సేవయే యుత్తమప్రేమచిహ్న మరయ!
ప్రేమమయుఁ డీశ్వరుఁడు సృష్టి ప్రేమమయము!
దైవమే ప్రేమ ప్రేమయే దైవ మరయ!

—మల్యాల వేంకటశివరామకృష్ణ

# అనంతకోటి నక్షత్రాలు

[౯౨-వ పేజీ తరువాయి]

వైతే, రసవత్తర కథనన్ని చేయాలి?-

అవును. దాంతోటి,- యీపత్రికల వల్ల నాలుగు డబ్బులు రాకపోయినా ?- యేంటో మానవప్రకృతిగదూ! అందరిలా కాకుండా, నవ్య- సాహిత్య సువర్ణ సైకత వేదికల్లో- తనకీర్తి జ్యోతులను ప్రసరించకపోడు !

లేకపోతే—

ఆంధ్రోద్యమాన్ని బాగా నడిపే- 'మడమత్రిప్పని ఆంధ్రవీరుని' గానన్నా!—

రైటు. నిజంగా—ఆంధ్రరాష్ట్రోద్యమము- అధోగతిగ నున్న యీస్థితిలో, యువకవర్గాని కంతటికీ- చైతన్యాన్ని కల్పిస్తూ...

'ఆంధ్ర తేజమ్మూర్తీభవింపా-
అద్భుతగ లెడి అయ్యారులడలెత్తి వేగా
దేశ దేశాలకూ ఒక్క టపరుగు'

చేయడూ?- కాకపోతే,...

—మృదులమానవ హృదయాలను నిష్కారుణంగా- కత్తిమొనతో కెలికి, చిత్రవధచేసే- వైద్యున్నిగా చేస్తే?-..

యెండల్లో మాడి-తన మధురఫలాలను ప్రజలకు దానంచేసే, రసాలశాఖలా?... యింత ప్రాణదానం నలుగురికీ చేసి, తనూ- నాల్గురాళ్ళు సంపాదించుకొని, వృద్ధాప్యంలో మన్ములను పోషించి- పేరు ప్రతిష్టలు సంపాదించుకోకపోడు. ...ఆరని తృష్ణతో భ్రమించే వుద్రిక్త మధువ్రతుడిలా?- యేమిటేమిటో ఒక్కొక్కటి నాముందర నృత్యంచేస్తూ రైలు బండిలా పరుగెత్తుతున్నాయి.

* * *

నరసరావుపేటలో దిగి యింటికి చేరుకున్నాను.

—నడవలో యెవరూలేరు. లోపలకు వెళ్ళగానే- ఏదో మాట్లాడుతూ, నాభార్యతో- మా అత్తమ్మ మంచం మీద కూచొనివుంది.

నడికట్టూ—తలమీద ముసుగూ... చిక్కిపోయినదేహంతో- లేవబోయింది నాభార్య- తూలుతూ, సోలుతూ !

'కూచో అమ్మాయి' అని- మా అత్తమ్మ లేచి- స్టూలుబల్ల తెచ్చి నాకేసింది.- కూచున్నాను.

''టెలిగ్రాం యిచ్చినా రాలేదేం-నాయనా?- నీకోసం, యెంతచూచాం- పిల్లాడిని పారవేయబోతే తండ్రివచ్చి చూసుకుంటాడు అని అది భోరున యేడ్చిందికదా !'

నిశ్చేష్టుడనైపోయా!- సోలిపోయింది ప్రాణం-

'యింతకూ పిల్లాడిని చూచుకునే అదృష్టంలేదు.' అంటూ- దుఃఖించింది.

రైలు పరుగెత్తినట్లు గుండె- గుభేలుమంది.

—గొంతుక రాచుకుపోయి మాట పెగల్లా! కళ్ళల్లో కళ్ళుతిరిగి- కాలరును తడిపాయి.

'యింకా అదృష్టవంతుడివిలే!' అంటూ- అత్తగారు తన కూతురుకి విసనకర్రతో విసిరింది.

రాచుకుంటున్న గొంతుకతో '..యేం, అత్తమ్మా!' అన్నా—

'—చూసుకుంటానికి కళ్ళుండొద్దూ!' అంది. యెక్కడో మాట్లాడినట్లు నాభార్య.

'అందరి భోజనాలయాయి...పది గంటలనుండి నొప్పులు ప్రారంభమైతే- మీ మామయ్యా, పుల్లయ్యా- డాక్టరుగారిని తీసుకొచ్చారు.

రాత్రంతా బాధపడి అయిదున్నరకు ప్రసవించిందమ్మాయి. పుట్టినప్పటినుంచీ. పిల్లాడికి యేడుపేలేదు. పిల్లాడికి యింజక్షనులు యిచ్చి వేడి తెప్పించి- కళ్ళు తెరిపించి- ముఖం కడుక్కొనేందుకు వెళ్ళారు డాక్టరుగారు.'

నాకు ఒక్కొక్కమాటా, వేయివేయిటన్నుల బరువును- హృదయంపై పెట్టినట్లయినై !—

'—తిరిగి డాక్టరుగారు వచ్చి చూసేసరికి చన్నీల్లకుండయి స్మృతి తప్పిపోయి పడుకొనివుంది అమ్మాయి.

—గాబరాతో రెండు యింజక్షనులు యిచ్చి- కస్తూరి తినిపించి, వేడి తెప్పించి అమ్మాయిని బ్రతికించారు. రెండు గంటలకల్లా పిల్లాడు చనిపోయాడు. నువ్వొచ్చి చూసుకుంటావని అమ్మాయి యేడ్చి- ఆపుచేయించిం దెంతోసేపు యేంలాభం.' అంటూ నిట్టూర్పు పుచ్చింది అత్తమ్మ.

—నాజ్యోతిచ్ఛాయను తిరిగి నూతన కళలతో ప్రకాశింపజేసి- నాజీవితాన్ని వివిక్త హిమవత్సాంద్రారణ్యముల్లోకి పోనియ్యకుండా- వెన్నెలలోని సుందర నందనోద్యానవనంగా మార్చినందుకు, హృదయంలో—డాక్టరుగారిని పూజించింది నామనస్సు !

* * *

వీధి అరుగుమీద వాల్చివున్న మంచంలో పండుకుంటూ,- అభాగ్యుని తలలోని అనంతవాంఛల్లాగు, అంతరించాయె- నా ఆలోచనలు అనుకున్నా !

చంద్రుడులేని ఆకాశంలో,— నా తలలోని వాంఛల్లాగు... అనంతకోటి నక్షత్రాలు!- అనంతకోటి....!